
సాక్షి
వైఎస్‌ఆర్ జిల్లా

శనివారం । 28 । జనవరి । 2023



వైభవంగా మహా కుంభాభిషేకం

మైదుకూరులోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో నిర్వహించిన మహా కుంభాభిషేక మహోత్సవాలు వైభవంగా ముగిశాయి. -8లో..



అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

పులివెందుల మోడల్ టౌన్‌లో భాగంగా జరుగుతున్న పనులు వేగంగా చేయాలని జేసీ సాయికాంత్‌వర్మ పేర్కొన్నారు. -8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 31.2/16.1

జిల్లాలో శుక్రవారం 16.1 – 31.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

అందుబాటులో తిరుమల లడ్డూలు



కడప కల్చరల్ : తిరుమలేశుని లడ్డూలు భక్తులకు అందుబాటులోకి వచ్చాయి. దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రథోత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా టీటీడీ అధికారులు రథోత్సవానికి హాజరయ్యే భక్తుల కోసం ప్రత్యేకంగా ఆరు వేల తిరుమల లడ్డూలు, వెయ్యి తిరుచానూరు అమ్మవారి లడ్డూరు అందుబాటులో ఉంచనున్నారు.

జిల్లాకు 2700 మెట్రిక్ టన్నుల యూరియా

కడప అగ్రికల్చర్: జిల్లాకు 2700 మెట్రిక్ టన్నుల యూరియా శుక్రవారం జిల్లా కేంద్రానికి చేరినట్లు జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరావు తెలిపారు. యూరియాను కడప ఏడీపీ సుబ్బారావు, యార్కెఫెడ్ డీఎం పరిమళజ్యోతి ఏవోలు సురేష్‌కుమార్ రెడ్డి, సుమంత్‌రెడ్డిలతో కలిసి జిల్లా వ్యవసాయ అధికారి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియాను జిల్లాలోని రైతు భరోసా కేంద్రాలు, డీలర్లకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. శనివారం కూడా మరో రేక్ ఎరువులు జిల్లాకు వస్తాయని ఆయన చెప్పారు. జిల్లాలో ప్రస్తుతం ఎక్కడ కూడా ఎరువుల కొరత లేదన్నారు.

రూ.448.28 కోట్లతో 296 రహదారి పనులు మంజూరు



మాట్లాడుతున్న ఏపీఆర్ఆర్‌పీ, ఏఐఐబీ సలహాదారు రమేష్‌దాస్

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలోని పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న రహదారుల నిర్మాణాలపై ఏపీఆర్ఆర్‌పీ, ఏఐఐబీ సలహాదారు రమేష్‌దాస్, పర్యవేక్షక ఇంజినీరు శ్రీనివాసరెడ్డి సమీక్ష నిర్వహించారు. శుక్రవారం కడప నగరంలోని ఎస్ఈ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వివిధ ప్యాకేజీల కింద 296 రోడ్డు పనులు రూ. 448.28 కోట్ల అంచనాతో మంజూరయ్యాయని వారు ఈ తెలిపారు. అందులో 244 పనులు 359.20 కోట్ల అంచనాతో టెండర్లు పిలిచి 146 పనులు ప్రారంభించామన్నారు. ఇందులో రూ. 118.04 కోట్ల పనులు జరిగాయన్నారు. మిగిలిన పనులు కూడా త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. టెండరు దశలో ఉన్న 52 పనులు సకాలంలో పూర్తి కావాలని చెప్పారు. ఈ సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు రామచంద్రారెడ్డి, ఎం.శ్యాంసుందర్‌రాజు, ఎం.ఓబుల్ రెడ్డి, కె.నాగరాజు, జయచంద్రారెడ్డి,కడప, జమ్మలమడుగు, పులివెందుల, బద్వేలు, రాజంపేట డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, ఏఈలు పాల్గొన్నారు.

లాభాల బిందువు

8000 హెక్టార్లు	జిల్లాలో డ్రిప్పు, స్ప్రింక్లర్ల ఏర్పాటుకు ఇచ్చిన లక్ష్యం
20987 హెక్టార్లు	ఇప్పటి వరకు రిజిస్ట్రేషన్
5640 హెక్టార్లు	అడ్మినిస్ట్రేటివ్ శ్యాంక్షన్
4025 హెక్టార్లు	పరికరాలను అందించిన పొలం:



- సాగు సాఫీకి డ్రిప్పు, స్ప్రింక్లర్లతో ప్రోత్సాహం
- లక్ష్యానికి మించి నమోదైన రిజిస్ట్రేషన్లు
- ఆనందంలో అన్నదాతలు

కాశినాయన మండలంలో పత్తిపంటకు ఏర్పాటు చేసిన డ్రిప్పు



కడప అగ్రికల్చర్: ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టేలా ప్రభుత్వం బిందు, తుంపర సేద్యాన్ని ప్రోత్సహిస్తోంది. ఇందుకోసం సన్న, చిన్నకారు రైతులకు రాయితీలు అందిస్తోంది. ఆసక్తి గల రైతులు తమ పరిధిలోని రైతుభరోసా కేంద్రాల్లో పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు కల్పించింది. ప్రస్తుతం ఈ ప్రక్రియ జిల్లాలో ముమ్మరంగా సాగుతోంది. మార్చి చివరినాటికి లక్ష్యం పూర్తి చేసేలా ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు (ఏపీఎంఐపీ) అధికారులు కృషి చేస్తున్నారు. డ్రిప్పు, స్ప్రింక్లర్ల ఏర్పాటుతో నీటి వృథా అరికట్టవచ్చు. విద్యుత్తు పొదుపు చేయవచ్చు. మొక్కకు సరిపడా నీరు అందుతుంది. పంట దిగుబడి గణనీయంగా పెరుగుతుంది. ఈ విధానం రైతులకు లాభదాయకంగా మారనుంది.

ముమ్మరంగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ...

డ్రిప్పు, స్ప్రింక్లర్ల ఏర్పాటుకు సంబంధించి జిల్లాలో 8000 హెక్టార్లకు మంజూరు చేయాలనేది ఏపీఎంఐపీ లక్ష్యం.ఇందుకోసం ఈనెల 27వ తేదీ నాటికి 16,8176 మంది రైతులు 20987 హెకార్డలో సూక్ష్మ పరికరాలకు ఏర్పాటుకు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు ఈ లక్ష్యాన్ని మార్చి చివరినాటికి పూర్తిచేసేలా ఏపీఎంఐపీ అధికారులు కృషి చేస్తున్నారు.



వేంపల్లె మండలం తాళ్లపల్లెలో బోరుకు ఏర్పాటు చేసిన డ్రిప్పును పరిశీలిస్తున్న అధికారులు

జిల్లాలోని పులివెందుల, ఎర్రగుంట్ల, పెద్దముడియం, వేంపల్లి, తొండూరు, వీఎస్‌పల్లె, వేముల, లింగాల మండలాల్లోని పలు గ్రామాల్లో 4699 మంది రైతులకు 5640 హెక్టార్లకు డ్రిప్పు, స్ప్రింక్లర్ పరికరాలను మంజూరు చేశారు. ఇందులో ఇప్పటి వరకు 3326 మందికి 4025 హెక్టార్లకు సంబంధించిన పరికరాలను అందచేశారు. వాటి ఏర్పాటులో రైతులు, కంపెనీ ప్రతినిధులు బిజీగా ఉన్నారు.

జిల్లాకు సంబంధించి డ్రిప్, స్ప్రింక్లర్ల ఏర్పాటుకు 2022–23 సంవత్సరానికి 36 మండలాల పరిధిలో 8000 హెక్టార్లను టార్గెట్‌గా ఇచ్చారు. ఇప్పటి వరకు 20,987 హెక్టార్లకు రిజిస్ట్రేషన్ చేసకున్నారు.

రైతులకు రాయితీ ఇలా...

బిందు, తుంపర సేద్య పరికరాల కోసం దరఖాస్తు చేసుకునే రైతులకు భూ విస్తీర్ణం మేరకు రాయితీ లభించనుంది. ఇందులో ఐదెకరాల లోపు భూమి కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనార్టీ రైతులకు 90 శాతం, 5 నుంచి 10 ఎకరాలలోపు ఉన్న రైతులకు 70 శాతం రాయితీపై పరికరాలను ప్రభుత్వం అందిస్తుంది. గతంలో డ్రిప్పు ఏర్పాటు చేసుకుని ఏడేళ్లు ముగిసిన రైతులు కూడా డ్రిప్పు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. డ్రిప్ పరికరాలను పంపిణీ చేసే 27 కంపెనీల్లో రైతులు దేన్నయినా ఎంపిక చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించింది.

క్షేత్రస్థాయిలో ముమ్మరంగా పరిశీలన.....

డ్రిప్పు, స్ప్రింక్లర్ల కోసం దరఖాస్తు చేసుకున్న రైతులకు ఎంత భూమి ఉంది..బోరు సౌకర్యం ఉందా.. ఉంటే అందులో ఎంత నీరు వస్తుంది.. రైతు పొలంలో ఎన్ని చెట్లు ఉన్నాయి.. పైపుల ఏర్పాటుకు ఎంత ఖర్చు వస్తుంది.. ఇందులో రైతుకు ఎంత సబ్సిడీ వర్తిస్తుందనే విషయాలను రైతు భరోసా కేంద్ర ఉద్యాన, వ్యవసాయశాఖ అసిస్టెంట్, కంపెనీ ప్రతినిధులు వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలను నమోదు చేసుకుంటున్నారు.ఇప్పటి వరకు 4699 మంది రైతులకు సంబంధించి 5640 హెక్టార్లకు అడ్మినిస్ట్రేటివ్ శ్యాంక్షన్ చేయగా ఇందులో 3326 మందికి 4025 హెక్టార్లకు డ్రిప్పు, స్ప్రింకర్ల పరికరాలను అందించారు.

అర్హులందరికీ పరికరాలు అందిస్తాం



డ్రిప్పు, స్ప్రింక్లర్ల ఏర్పాటుకు సంబంధించి మార్చి చివరినాటికి లక్ష్యం పూర్తి చేసేలా అధికారులు కృషి చేస్తున్నారు. రైతులు తమతమ పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో(ఆర్‌బీకే) రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఆర్‌బీకే ఇన్‌చార్జులు, కంపెనీ ప్రతినిధుల ద్వారా ప్రాథమిక సర్వే చేయించుకోవాలి. రిజిస్ట్రేషన్ చేసుకున్న అర్హులైన ప్రతి రైతుకు డ్రిప్పు, స్రింక్లర్లను మంజూరు చేస్తాం. వీటిని హార్టికల్చర్, అగ్రికల్చర్ అసిస్టెంట్ల ద్వారా అందిస్తాం.
– మురళీమోహన్‌రెడ్డి, (ఏపీడి) ఇన్‌చార్జి జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి

శతశాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఏపీ మోడల్ స్కూళ్ల స్టేట్ జాయింట్ డైరెక్టర్ ఎం వీ కృష్ణారెడ్డి

వల్లూరు: త్వరలో జరగనున్న పదోతరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఏపీ మోడల్ స్కూళ్లలోని విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించడానికి పాఠశాలల ప్రిన్సిపాళ్లు పూర్తి స్థాయిలో కృషి చేయాలని ఆంధ్ర ప్రదేశ్ ఆదర్శ పాఠశాలల స్టేట్ జాయింట్ డైరెక్టర్ ఎం వీ కృష్ణారెడ్డి అన్నారు. వైఎస్సార్ జిల్లా వల్లూరు మండలం గంగాయపల్లెలో ఉన్న ఏపీ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లోని ఏపీ మోడల్ స్కూళ్ల ప్రిన్సిపాళ్లతో శుక్రవారం జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం పలు పథకాలను అమలు చేయడం ద్వారా విద్యాభివృద్ధికి కృషి చేస్తోందని అన్నారు. వాటిని సద్వినియోగం చేసుకుని ప్రతి విద్యార్థి ఉన్నత స్థానాలకు చేరుకోవడానికి ఉపాధ్యాయులు తోడ్పాటు అందించాల్సిన అవసరం ఉందన్నారు. మార్చి మాసంలో ఇంటర్, పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా తీర్చి దిద్దాలని అన్నారు. వెనుకబడిన వారి పట్ల శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. జిల్లా విద్యా శాఖాధికారి దేవరాజు మాట్లాడుతూ పరీక్షల్లో మంచి ఫలితాలను సాధించడానికి ప్రతి ప్రిన్సిపల్ చర్యలు చేపట్టాలని అన్నారు. ఫలితాల సాధనకు తీసుకోవాల్సిన చర్యల గురించి సూచనలు అందించారు. ఎంఈవో నారాయణ, అన్నమయ్య,వైఎస్సార్ జిల్లాల్లోని ఏపీ మోడల్ స్కూళ్ల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

- అనంతరం పాఠశాలలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులతో జేడీ మాట్లాడారు. సిలబస్, పరీక్షల సరళి గురించి ఆరా తీశారు. ప్రణాళికాబద్ధంగా చదివి మంచి మార్కులు సాధించాలని వారికి సూచించారు.


గండికోట.. ప్రగతి బాట

- 'స్వదేశీ దర్శన్' పథకం కింద ఎంపిక
- నేడు ఒబెరాయ్ సంస్థ ప్రతినిధుల రాక

జమ్మలమడుగు/కడప కల్చరల్ : ప్రముఖ పర్యాటక కేంద్రమైన గండికోట అభివృద్ధి పథంలో పయనిస్తోంది. ఇక్కడ అంతర్జాతీయ స్థాయి ఒబెరాయ్ ఇంటర్నేషనల్ స్టార్ హోటళ్ల సంస్థ తమ బ్రాంచ్‌ను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటోంది. ఈ నేపథ్యంలో ఆ సంస్థ ప్రతినిధులు మరోసారి పరిశీలించటానికి శనివారం రానున్నారు. మొన్నటివరకు నిస్తేజంగా సాగిన గండికోట పర్యాటక అభివృద్ధి పనులు కొత్త ప్రభుత్వం చేపట్టిన చర్యలతో ఊపందుకున్నాయి. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో స్వదేశీ దర్శన్ కింద ఎంపిక చేసిన రెండు ప్రాంతాలలో ఒకటి గండికోట. దీని ద్వారా రూ.150 కోట్లతో వాచ్ టవర్లు, వసతి భవనాలు, పార్కులు ఇలా పర్యాటకులకు కావాల్సిన అన్ని ఆకర్షణలు కల్పించనున్నారు.

ఏర్పాట్లు చేస్తున్న రెవెన్యూ అధికారులు

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రైవేట్ భాగస్వామ్యంతో గండికోటను అభివృద్ధి చేయాలని సంకల్పించారు. దీంతో ఒబెరాయ్ సంస్థ రూ.250 కోట్లతో సెవెన్‌స్టార్ హోటల్‌తోపాటు స్టార్ సౌకర్యాలు గల 120 విల్లాలను ఏర్పాటు చేస్తామని చెప్పడంతో.. రాష్ట్ర ప్రభుత్వం 99 ఏళ్ల లీజుతో 50 ఎకరాల భూమిని కేటాయించింది. గతేడాది అక్టోబర్ 11న ఒబెరాయ్ హోటల్స్, రిసార్ట్స్ సీఈఓ అర్జున్‌సింగ్ ఒబెరాయ్, రాజమాన్ శంకర్, వినోద్ గోస్వామి గండికోటలోని కొట్టాలపల్లి, పెన్నానదిలోయ తదితర ప్రాంతాలను పరిశీలించారు. వారికి జిల్లా కలెక్టర్ విజయరామరాజు, జాయింట్ కలెక్టర్ సాయికాంత్‌వర్మ, ఆర్డీఓ జి.శ్రీనివాసులు దగ్గరుండి భూములను చూపించారు. మూడు నెలల తర్వాత తిరిగి ఒబెరాయ్ సంస్థ ప్రతినిధులు వస్తుండటంతో రెవెన్యూ అధికారులు గండికోట ప్రాంతానికి శుక్రవారం వెళ్లి వారికి కావాల్సిన ఏర్పాట్లను చూస్తున్నారు. శనివారం మధ్యాహ్నం తర్వాత వారు వస్తారని పర్యాటక, రెవెన్యూ శాఖలకు చెందిన అధికారులు పేర్కొన్నారు.



గండికోట ప్రవేశ ద్వారం

నేటి నుంచి గండికోటలో 'భారతీయుడు-2' చిత్రీకరణ

జమ్మలమడుగు: పర్యాటక కేంద్రమైన గండికోటలో సినిమా షూటింగ్ ప్రారంభం కానుంది.. ప్రముఖ నటుడు కమలహాసన్ నటించి సూపర్ హిట్ అయిన 'భారతీయుడు'సినిమాకు సీక్వెల్ భారతీయుడు–2 శంకర్ దర్శకత్వంలో రూపొందనుంది.ఈ నేపథ్యంలో శనివారం నుంచి సినిమా షూటింగ్ జరగనుంది. ఇందుకోసం రెండు రోజుల నుంచి పురాతన కాలం నాటి మార్కెట్ సెట్టింగ్ వేస్తున్నారు. షూటింగ్ ఆరు రోజుల పాటు కొనసాగనుంది. హీరో కమలహాసన్, దర్శకుడు శంకర్ కూడా గండికోటకు వస్తున్నారని సమాచారం.

ప్రజల భద్రతే ప్రభుత్వ ధ్యేయం

- రహదారుల భద్రతకు సమన్వయంతో పని చేయండి
- కలెక్టర్ విజయ రామరాజు



మాట్లాడుతున్న కలెక్టర్ విజయ రామరాజు

కడప సిటీ : ప్రజల ప్రాణ భద్రతే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని కలెక్టర్ విజయరామరాజు అన్నారు. జిల్లాలో రహదారుల భద్రత కోసం, పటిష్ట చర్యలు చేపట్టేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా రహదారుల భద్రతా సమన్వయం కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యధిక శాతం ప్రజలు రోడ్డు ప్రమాదాల కారణంగా ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. జనాభాతో పాటు వాహనాల వినియోగం కూడా పెరిగిందన్నారు. అందువల్ల అధికారులు భద్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రమదాల నివారణకు, తీసుకవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై విధిగా నివేదికలు ఇవ్వాలన్నారు.రోడ్డు ప్రమాదాలు ఎక్కువ జరిగే ప్రాంతాల్లో ప్రమాద సంకేత సూచికలను ఏర్పాటు చేయాలన్నారు. 108 వాహన సేవలు రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయాల్లో సకాలంలో అక్కడికి వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి రోడ్డు ప్రమాదాన్ని విశ్లేషించేందుకు రెవెన్యూ డివిజన్ల వారీగా ఒక ఎక్స్‌పర్ట్ కమిటీని నియమించాలన్నారు. రోడ్డు ప్రమాదాల్లో తలకు బలమైన గాయాలైన వారికి అత్యవసర చికిత్స అందించేందుకు అందుబాటులో ఉన్న న్యూరో సర్జన్లకు అనుమతులు ఇవ్వాలని చెప్పారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా అత్యవసర సమయాల్లో ఎయిర్ అంబులెన్స్ ఉపయోగించేలా ఎయిర్‌లైన్స్, ఆర్ అండ్ బి అధికారులతో సమీక్షించి అమలుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ తుషార్ డుడీ, డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమీషనర్ మీరా ప్రసాద్, ఆర్డీఓ సుశీల, ట్రాఫిక్ డీఎస్పీ బాల స్వామిరెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నందలూరు సబ్‌సెంటర్‌లో ఆస్ట్రోటర్ఫ్ ఏర్పాటు చేస్తాం



క్రీడాకారులకు సూచనలు ఇస్తున్న జిల్లా క్రికెట్ సంఘం ప్రతినిధులు

కడప స్పోర్ట్స్/రాజంపేట: నందలూరులోని క్రికెట్ సబ్ సెంటర్‌కు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు నూతనంగా ఆస్ట్రోటర్ఫ్‌ను ఏర్పాటు చేస్తామని క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్సార్ డిస్ట్రిక్ట్ (సీఏవైడీ) జిల్లా కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం నందలూరు పట్టణంలోని క్రికెట్ సబ్ సెంటర్‌ను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎందరో ఉత్తమ క్రీడాకారులను జిల్లాకు, రాష్ట్రానికి అందించిన ఘనత నందలూరు సబ్‌సెంటర్‌కు ఉందన్నారు. నందలూరుకు చెందిన పలువురు క్రీడాకారులు వివిధ వయో విభాగాల్లో రాష్ట్రస్థాయి, జాతీయస్థాయిలో రాణిస్తుండటం అభినందనీయమన్నారు.జిల్లా క్రికెట్ ఆపరేషన్స్ డైరెక్టర్ ఎస్. ఖాజామైనుద్దీన్ మాట్లాడుతూ అండర్–12 నుంచి సీనియర్ విభాగం వరకు చెప్పుకోదగ్గస్థాయిలో క్రీడాకారులు ప్రాతినిధ్యం వహిస్తున్నారన్నారు. కడపలోని కేఎస్ఆర్ఎం, కేఓఆర్ఎం క్రీడామైదానాల్లో ప్రతి శని, ఆదివారం అండర్–12, 14, 16, 19 గ్రూప్ విభాగాల్లో లీగ్ మ్యాచ్‌లు నిర్వహించనున్నట్లు తెలిపారు. రంజీ మాజీ క్రీడాకారుడు పైడికాల్వ విజయ్‌కుమార్ మాట్లాడుతూ బ్యాటింగ్, బౌలింగ్‌లోని నైపుణ్యాలను క్రీడాకారులకు వివరించారు. కార్యక్రమంలో సబ్‌సెంటర్ హెడ్ కోచ్ గయాజ్, అసిస్టెంట్ కోచ్ ఫిరోజ్‌ఖాన్, ట్రైనర్ పి. శివకోటి తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ వైభోగమే !



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



కల్యాణోత్సవంలో స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు



గజవాహనంపై స్వామివారి గ్రామోత్సవం

కడప కల్చరల్ : ఆ దివ్య మంగళమూర్తి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. తిరుమలేశుని తొలిగడపగా పేరుగాంచిన, తిరుమల రాయుని ప్రతిరూపంగా భావిస్తున్న కడపరాయుని కల్యాణోత్సవాన్ని బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణాన్ని, కల్యాణ వేదికను రంగురంగుల పూలు, అరటి పిలకలతో అలంకరించారు. వేదికపై ఏర్పాటు చేసిన పెళ్లి పీటలపై స్వామి, అమ్మవార్లను కొలువుదీర్చారు. స్థానిక అర్చకులు మచ్చాశేషాచార్యులు, కృష్ణమోహన్, తివిక్రమ్, పలువురు సహాయక అర్చకులతో కలిసి శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

- అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు కప్పురపు పరిమళాల కడప రాయుని కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు ఆ ప్రాంగణానికి సమయానికి ముందే చేరుకున్నారు. స్వామి దివ్య మోహన రూపాన్ని తిలకించి ఆనంద పరవశులయ్యారు. మామిడి తోరణాలు ఈ కార్యక్రమానికి మరింత వన్నె కల్పించాయి. సమ్మోహన రూపంలో ధగధగలాడే నూతన వస్త్రాలతో వరుడిగా స్వామి కొలువుదీరగా, మరోవైపు ముగ్ధ మనోహర రూపాలతో శ్రీదేవి, భూదేవి అమ్మవార్లు వధువులుగా ఒదిగి కూర్చొన్నారు. మంచి గంధం ఇస్తున్న మధుర పరిమళం, మంగళ వాయిద్యాల సుస్వరాలు భక్తులను మైమరిపిస్తుండగా రెండు కళ్లు చాలవన్నట్లు కల్యాణ క్రతువును తిలకించారు.

ఘనంగా కడప రాయుని కల్యాణం

శాస్త్రోక్తంగా..

కార్యక్రమంలో భాగంగా గణపతిపూజ, కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, మాంగల్య పూజ, భక్తులకు మాంగల్య దర్శనం తదితర క్రతువుల అనంతరం అర్చకులు స్వామి పక్షాన అమ్మవార్ల గళసీమల్లో మంగళ సూత్రాలను అలంకరించారు. తలంబ్రాలు కార్యక్రమాన్ని ఉత్సాహ భరితంగా నిర్వహించారు. అనంతరం లాజహోమం నిర్వహించారు.ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి, ఇతర అధికారులు కల్యాణోత్సవాన్ని పర్యవేక్షించారు. టీటీడీ పాలక మండలి సభ్యుడు టంగుటూరి మారుతిప్రసాద్ దంపతులు ప్రభుత్వ పక్షాన స్వామి, అమ్మవార్లకు నూతన వస్త్రాలను ఊరేగింపుగా తెచ్చి సమర్పించారు. కల్యాణం పూర్తయ్యేవరకు ఉండి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తుల పక్షాన నిర్వాహకులు ముత్యాల తలంబ్రాలను సమర్పించగా, కల్యాణం అనంతరం తలంబ్రాలలో వాడిన అక్షతల కోసం భక్తులు పెద్ద ఎత్తున ఎగబడ్డారు. నిర్వాహకులు వారికి అక్షతలతోపాటు ముత్యాల తలంబ్రాలను కల్యాణ ప్రసాదంగా పంచి పెట్టారు. కల్యాణం అనంతరం ఆ మంగళ మూర్తులను మాడవీధుల్లో ఊరేగించారు. రాత్రి గజ వాహనంపై స్వామి, అమ్మవార్లకు గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

నేడు రథ సప్తమికి భారీ బందోబస్తు

కడప అర్బన్: తిరుమల తొలిగడప దేవుని కడప శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 28న రథసప్తమి సందర్భంగా వేడుకలు జరుగనున్నాయి. ఈ సందర్భంగా భారీ భద్రతా ఏర్పాట్లు నిర్వహించనున్నట్లు కడప డీఎస్పీ వెంకట శివారెడ్డి తెలియజేశారు. శుక్రవారం కడపలోని తమ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. రథసప్తమి రోజున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా డీఎస్పీతో పాటు, ఆరుగురు సీఐలు, 11 మంది ఎస్ఐలు, 200 మంది సిబ్బందితో భారీ బందోబస్తు నిర్వహిస్తున్నామన్నారు. చైన్‌స్నాచింగ్‌లు, జేబుదొంగతనాలు, ఈవ్‌టీజింగ్‌లు, రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. . భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టామన్నారు.

పక్షుల అందాలు.. కిలకిలా రావాలు



ఎత్తయిన కొండలు.. కనుచూపు మేర పరుచుకున్న పచ్చదనం.. చల్లని వాతావరణం.. చుట్టూ పచ్చని చెట్లు.. కరెంటు తీగలపై వ రుస కట్టిన పక్షులు.. కిలకిలా రావాలు.. ఈ అందాలు కడప నగర శివారులోని సిద్దవటం మండలం మాచుపల్లె పొలాల్లో నెలువైనాయి. ఈ ప్రాంతం ప్రకృతి ప్రేమికులను ఆకర్షిస్తోంది. తెల్లవారుజామున మంచు కురుస్తున్న వేళ.. మరింత రమణీయంగా కనిపిస్తోంది. మనస్సుకు ఆహ్లాదం, ఉత్సాహాన్ని కలిగిస్తున్నాయి.

– ఫొటోగ్రాఫర్, సాక్షి, కడప

చేనుకు చీర.. రైతుకు రక్ష



పెద్దముడియం మండలం నెమళ్లదిన్నె నుంచి ఎస్.కొట్టాలపల్లెకు వెళ్లే దారిలో పంట చుట్టూ కట్టిన చీరలు

పంటలు కాపాడుకోవడానికి రైతులు వినూత్న ప్రయోగాలు చేస్తున్నారు. చేనుకు కంచెగా రంగురంగుల చీరలు ఉపయోగిస్తున్నారు. పెద్దముడియం మండలంలోని పొలాలపై అడవి జంతువులు రాత్రి పూట దాడులు చేస్తున్నాయి. పంటలను నాశనం చేస్తున్నాయి. దీంతో ఏం చేయాలో తెలియక వారు ఆలోచించి చివరికి ఓ వినూత్న ప్రయోగం చేశారు. పాత చీరలు పొలాల చుట్టూ కట్టారు. చీరలు గాలికి కదు లుతూ, రంగు రంగులుగా కనిపిస్తుండటంతో.. ఏదో అడ్డుగా ఉందని భావించి అడవి పందులు రావడం లేదని రైతులు తెలుపుతున్నారు.

– పెద్దముడియం

క్లుప్తంగా

నేడు అత్తిరాలలో వేలం

రాజంపేట రూరల్ : ప్రముఖ శైవ క్షేత్రమైన అత్తిరాలలోని శ్రీకామాక్షి సమేత త్రేతేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం ఉదయం 11 సమయంలో టెంకాయల విక్రయ వేలం పాట నిర్వహించనున్నట్లు ఈఓ కొండారెడ్డి, దేవస్థానం కమిటీ చైర్మన్ వెలగచెర్ల వెంకటసుబ్బారెడ్డి శుక్రవారం తెలియజేశారు. మహాశివరాత్రిని పురస్కరించుకొని 2023–2024 సంవత్సరానికి ఈ వేలం పాటను నిర్వహించనున్నారు.

ఐక్యతతోనే అభివృద్ధి సాధ్యం



సంఘీభావం వ్యక్తం చేస్తున్న బలిజ సంఘం నేతలు

కడప రూరల్ : ఐక్యతతోనే అభివృద్ధి సాధ్యమని బలిజ సంఘం నేతలు పేర్కొన్నారు. శుక్రవారం శ్రీ కృష్ణదేవరాయలు జయంతి సందర్భంగా స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో బలిజ సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు ఆధ్వర్యంలో కాపునాడు రాష్ట్ర అధ్యక్షులు నారాయణస్వామి రాయల్ అధ్యక్షతన బలిజ వర్గీయుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశ్రామికవేత్త దుర్గాప్రసాద్, తుమ్మలకుంట శివశంకర్, సుగవాసి హరీంద్రనాథ్, నారాయణస్వామి రాయల్ మాట్లాడుతూ శ్రీకృష్ణ దేవరాయలు జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలన్నారు. పార్టీలకు అతీతంగా బలిజ వర్గీయుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత కల్పించాలన్నారు. అన్ని పార్టీలు రాజకీయంగా బలిజలకు ప్రాముఖ్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఆర్‌ఐ తోట కృష్ణ, కొండయ్య, మాదినేని రామసుబ్బయ్య, పసుపులేటి శ్రీనివాసులు, ఆర్టీసీ సుధాకర్, బండి ప్రతాప్, సుదర్శన్‌రాయల్, అన్ని పార్టీలు, సంఘాలకు చెందిన బలిజ సంఘీయులు పాల్గొన్నారు.

చోరీ కేసుల్లో నిందితుడి అరెస్ట్

- రూ.4 లక్షల బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం
- కడప డీఎస్పీ బి.వెంకటశివారెడ్డి వెల్లడి



నిందితుడి అరెస్ట్ వివరాలు వెల్లడిస్తున్న కడప డీఎస్పీ బి.వెంకటశివారెడ్డి

కడప అర్బన్ : రెండు ప్రాంతాల్లో ఇంట్లో చోరీకి పాల్పడిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి సుమారు రూ.4 లక్షల విలువైన 73 గ్రాముల బంగారు, 402 గ్రాముల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన వివరాలను శుక్రవారం కడప డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ బి.వెంకటశివారెడ్డి వెల్లడించారు. కడప నగరం నకాష్‌లోని కాపు వీధిలో నివసిస్తున్న అరిగెల లక్ష్మి అలియాస్ సుధ ఈ నెల 25వ తేదీన మధ్యాహ్నం సుమారు 12 గంటలకు ఇంటికి తాళం వేసి పక్కవీధికి వెళ్లి తిరిగి వచ్చింది. ఆ లోపే అక్బర్ ఆలీ తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించాడు. ఇంటిలోపల బీరువా తాళం పగులగొట్టి లోపలున్న రూ.2.50 లక్షల విలువైన బంగారు ఆభరణాలు దొంగలించుకుని వెళుతుండగా.. సుధకు తారసపడ్డాడు. పట్టుకునేలోపే పారిపోయినట్లు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కడప టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అదే విధంగా గత ఏడాది ఏప్రిల్ చివరి వారంలో చెన్నూరులో నడిమల్ల వీధిలో నివాసం వుంటున్న షేక్ మహమ్మద్ వారిస్ అనే వ్యక్తి ఇంటిలో గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి బీరువాలో వున్న 1.50 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలను దొంగలించుకుపోయినట్లు కేసు నమోదైంది. ఈ చోరీ సంఘటనలపై జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు కడప డీఎస్పీ బి. వెంకట శివారెడ్డి ఆధ్వర్యంలో కడప టూటౌన్ పీఎస్ సీఐ సయ్యద్ హాసం, ఎస్‌ఐ సంజీవరాయుడు తమ సిబ్బందితో కలిసి విచారణ చేపట్టారు. అక్బర్ ఆలీగా గుర్తించి ప్రత్యేక బృందంతో గాలింపు చర్యలు చేపట్టారు. కడప నగరం గౌస్‌నగర్‌లోని కేసీ కెనాల్ కట్ట సమీపంలో అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి రెండు చోరీ కేసుల్లో రూ. 4 లక్షల విలువైన 73 గ్రాముల బంగారు, 402 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. దొంగను అరెస్ట్ చేయడంలో కృషి చేసిన కడప టూటౌన్ సీఐ సయ్యద్ హాసం, ఎస్‌ఐ సంజీవరాయుడు, ఏఎస్‌ఐ పి.భాస్కర్, హెడ్‌కానిస్టేబుళ్లు పాక వరప్రసాద్, వెంకటేష్, కానిస్టేబుళ్లు నారాయణరెడ్డి, బాషా, రామకృష్ణ, తిరుపతయ్య, రఘు, సుందరబాబును డీఎస్పీ వెంకటశివారెడ్డి అభినందించారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో చోరీ

– హుండీ, పంచలోహ విగ్రహాలు, ప్రమిదలు, వెండి సామాన్లు అపహరణ



ఆలయాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

బి.కోడూరు : మండలంలోని ఎర్రిఓబన్నబావి సమీపాన ఉన్న నల్లకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం 10 నుంచి 12 గంటల సమయంలో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఆలయంలో ఉన్న సీసీ కెమెరాల వైర్లను కట్ చేసి హుండీ, 40 గ్రాముల లక్ష్మీదేవి వెండి విగ్రహం, పంచలోహ ప్రమిదలు, గంటలను దొంగలించారు. 12 గంటల సమయంలో వచ్చిన ఆలయ అర్చకులు ఈ విషయాన్ని గమనించి స్థానికంగా ఉన్న గ్రామస్తులకు తెలియజేశారు. అక్కడికి చేరుకున్న గ్రామస్తులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి బి.కోడూరు పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు పోరుమామిళ్ల సీఐ సురేష్‌రెడ్డి, బి.కోడూరు ఎస్‌ఐ నస్రీన్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వారు కేసు నమోదు చేసుకుని డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంతో విచారణ చేపట్టారు. చోరీకి గురైన వస్తువులు, హుండీలో ఉన్న నగదు విలువ సుమారు రూ.3 లక్షలు ఉంటాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

- 46 మద్యం బాక్స్‌లు స్వాధీనం
- ఏఎస్పీ తుషార్ డూడి వెల్లడి



మద్యం, నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ తుషార్ డూడి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : కర్ణాటక రాష్ట్రానికి చెందిన మద్యాన్ని తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు జిల్లా అదనపు ఎస్పీ తుషార్ డూడి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని కడప ఎస్‌ఈబీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఖాజీపేట మండలం రావులపల్లె క్రాస్ రోడ్డు వద్ద ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్, డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది వాహనాల తనిఖీ చేపట్టారు. బ్రహ్మంగారిమఠానికి చెందిన ఇండ్ల నిత్య శివరామ్ కర్ణాటక రాష్ట్రానికి చెందిన 46 మద్యం బాక్సులను వాహనంలో అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఈ బాక్సుల్లోని వివిధ బ్రాండ్లకు చెందిన 2208 మద్యం బాటిళ్లను సీజ్ చేసి, సదరు వ్యక్తిని అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. ఇందులో మరో వ్యక్తి ప్రమేయం ఉన్నట్లు సమాచారం ఉండటంతో అతని కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపడుతున్నామని ఏఎస్పీ తెలిపారు. పట్టుకున్న మద్యం విలువ దాదాపు రూ. 1.6 లక్షలు ఉంటుంది. ఈ కేసులో ప్రతిభ చూపిన ఎస్‌ఈబీ సీఐ విశ్వనాథరెడ్డి, ఇతర సిబ్బందికి ఏఎస్పీ ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. ఈ సమావేశంలో ఎస్‌ఈబీ అసిస్టెంట్ కమిషనర్ విజయశేఖర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఫ్యాక్షన్ జోన్ డీఎస్పీ చెంచుబాబు, టాస్క్‌ఫోర్స్ సీఐ పురుషోత్తం, సిబ్బంది పాల్గొన్నారు.

ఇతర రాష్ట్రాల మద్యం అమ్మకాలు సాగిస్తే చర్యలు

ఇతర రాష్ట్రాల మద్యం అమ్మకాలు జిల్లాలో సాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని కడప ఎస్‌ఈబీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోకి తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు నుంచి వచ్చే వాహనాలను నిత్యం తనిఖీలు చేస్తున్నామని తెలిపారు. ఎవరైనా ఇతర రాష్ట్ర మద్యం అమ్మకాలు కొనసాగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైతే పీడీ యాక్టు చట్టాన్ని ప్రయోగిస్తామని తెలియజేశారు. ఇతర రాష్ట్రాల మద్యాన్ని తరలిస్తున్నట్లు ఎవరికైనా సమాచారం అందితే తమకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్యాక్షన్ జోన్ డీఎస్పీ చెంచుబాబు, కడప ఎస్‌ఈబీ సీఐ విశ్వనాథరెడ్డి, టాస్క్‌ఫోర్స్ సీఐ పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

వైఎస్‌ఆర్ ఏఎఫ్‌యూ పరీక్షా ఫలితాలు విడుదల

ఏఎఫ్‌యూ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్‌ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, కాలేజ్ ఆఫ్ ఫైన్‌ఆర్ట్స్ విభాగాలకు సంబంధించిన ఫలితాలను విశ్వవిద్యాలయ అధికారులు విడుదల చేశారు. శుక్రవారం విశ్వవిద్యాలయంలో ఆర్21 ప్రథమ సెమిస్టర్, ఆర్20 రెండవ సెమిస్టర్, ఆర్20 మూడవ సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలను విశ్వవిద్యాలయ ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ఆచార్య పి.ఫజుల్ రెహమాన్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి.సురేంద్రనాథ్‌రెడ్డి స్క్రీన్‌పై విడుదల చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విశ్వవిద్యాలయ విద్యార్థులు 73 శాతం ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. సకాలంలో ఫలితాలు విడుదల చేసిన పరీక్షల విభాగాన్ని అభినందించారు. కార్యక్రమంలో వైఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ఏఎఫ్‌యూ డిప్యూటీ రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్, సూపరింటెండెంట్ వై. పవన్‌కుమార్‌రెడ్డి, పరీక్షల నియంత్రణ సహాయ అధికారులు ఉదయప్రకాష్‌రెడ్డి, లక్ష్మీప్రవల్లిక పాల్గొన్నారు.



పరీక్షా ఫలితాలను స్క్రీన్‌పై విడుదల చేస్తున్న వీసీ, రిజిస్ట్రార్

ఫ్లైయాష్ టిప్పర్‌ను అడ్డుకున్న ప్రజానీకం



స్థానికులతో చర్చిస్తున్న ఎస్‌ఐ వెంకటక్రిష్ణయ్య

ఎర్రగుంట్ల : రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు(ఆర్టీపీపీ) నుంచి ఫ్లైయాష్‌ను తరలిస్తున్న టిప్పర్‌ను ప్రజలు అడ్డుకున్నారు. ఈ సంఘటన ఎర్రగుంట్ల పట్టణంలోని వేంపల్లి రోడ్డులో శుక్రవారం చోటుచేసుకుంది. ఫ్లైయాష్ (బూడిద) వాహనాల నుంచి కింద పడుతుండటం వల్ల.. దుమ్ము, ధూళితో ప్రయాణికులు, స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని వారు తెలిపారు. కళ్లలో మంటలు, చర్మ వ్యాధుల బారిన పడి ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధిక లోడ్‌తో వెళ్తున్న వాహనాలను కట్టడి చేయడంలో పోలీస్, ఆర్టీఓ, రెవెన్యూ శాఖ, మైనింగ్ శాఖల అధికారులు విఫలమయ్యారని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరారు. అక్కడికి ఎస్‌ఐ వెంకట క్రిష్ణయ్య వచ్చి వారితో చర్చించారు. ఇక నుంచి ఈ సమస్య తలెత్తకుండా చూస్తామని సంబంధిత నిర్వాహకులు చెప్పడంతో శాంతించారు.

మాతృ, శిశు మరణాలు అరికట్టడమే లక్ష్యం

కడప సిటీ : మాతృ, శిశు మరణాలు అరికట్టడమే లక్ష్యంగా పని చేయాలని కలెక్టరేట్ ఓఎస్‌డీ రఘునాథ్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీసీ హాలులో జిల్లా స్థాయి ప్రసూతి (మాతృ), మరణాల విచారణ, బాధ్యత (ఎండీఎస్‌ఆర్) కమిటీ సమీక్షా సమావేశం ఓఎస్‌డీ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి డీఎంహెచ్‌ఓ నాగరాజు, రిమ్స్ జీజీహెచ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఓఎస్‌డీ మాట్లాడుతూ జిల్లాలో ప్రసూతి మరణాల రేటును జీరో శాతానికి తీసుకు వచ్చేందుకు సంబంధిత అధికారులు బాధ్యతాయుతంగా, అంకిత భావంతో పని చేయాలన్నారు. 'జన్మనిస్తూ ఏ తల్లీ మరణించకూడదు, జన్మిస్తూ ఏ శిశువు మరణించకూడదు' అనే నినాదంతో రాష్ట్ర ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపడుతోందన్నారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్, అదనపు డీఎంహెచ్‌ఓలు ఖాదర్‌వలీ, ఉమామహేశ్వర్, 108 జిల్లా కో ఆర్డినేటర్ నాగరాజు, పీహెచ్‌సీ, సీహెచ్‌సీల వైద్యాధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టరేట్ ఓఎస్‌డీ రఘునాథ్

యూత్ పార్లమెంట్ ఎంపికలకు చక్కటి స్పందన



కాంపిటీషన్‌ను పరిశీలిస్తున్న అధికారులు (ఇన్‌సెట్) వర్చువల్ విధానంలో పోటీల్లో పాల్గొన్న యువతి

కడప స్పోర్ట్స్ : కడప నగరం బాలాజీనగర్‌లోని యూత్ హాస్టల్‌లో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి యూత్ పార్లమెంట్ కాంపిటీషన్‌కు యువత నుంచి చక్కటి స్పందన లభించింది. వర్చువల్ విధానంలో నిర్వహించి ఈ పోటీలను నెహ్రూ యువకేంద్రం జిల్లా అధికారి మణికంఠ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు చెందిన యువతకు పార్లమెంట్‌లో ప్రసంగించే అరుదైన అవకాశం కోసం ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గతేడాది జిల్లాకు చెందిన మిద్దె రూప జాతీయ స్థాయిలో రాణించి పార్లమెంట్‌లో ప్రసంగించిన విషయం గుర్తుచేశారు. అనంతరం ఎంపికలు నిర్వహించి త్వరలో అనంతపురంలో నిర్వహించనున్న రీజినల్ స్థాయి యూత్ పార్లమెంట్ పోటీల్లో పాల్గొనే 10 యువతతో కూడిన జిల్లా జట్టును ప్రకటించారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా కడప ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకులు డా.జి.విజయలక్ష్మి, శ్రావణి వ్యవహరించారు.

రీజినల్ స్థాయికి ఎంపికైన వారు : ఎస్.ఆయేషా, అమీషానాజ్, యశ్వంత్‌రెడ్డి, ఎస్. సానియ, డి.సృజన, ఎస్.అమీనా, ఎస్.వైష్ణవి, పి.రాజశేఖర్, జె.పి.సంజన, ఎస్.అర్షియఅహ్మద్.

డివైడర్‌ను ఢీకొన్న ద్విచక్ర వాహనం

– ఇద్దరు మహిళలకు గాయాలు

చింతకొమ్మదిన్నె : కడప–రాయచోటి ప్రధాన రహదారిలోని ఆర్టీఏ కార్యాలయం ఎదురుగా శుక్రవారం ద్విచక్ర వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ఇద్దరు మహిళలకు గాయాలయ్యాయి. ఎస్‌ఐ భూమా అరుణ్‌రెడ్డి తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కమ్మవారిపల్లికి చెందిన సుహాసిని, సంధ్య అనే ఇద్దరు వలంటీర్లు కడప నగరంలో సొంత పనులు ముగించుకుని తిరిగి ఇంటికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఇందులో వారిద్దరూ గాయపడటంతో చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు.

రామయ్య సేవకు 'గోటి తలంబ్రాలు'



గోటి తలంబ్రాలకు వడ్లను స్వీకరిస్తున్న భక్తులు

కడప కల్చరల్ : ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు మార్చి చివరి వారంలో జరగనున్న విషయం తెలిసిందే. భద్రాచలంలో లాగా ఈ ఆలయంలో కూడా వార్షిక బ్రహ్మోత్సవాలకు భక్తులు గోటితో వలిచిన వడ్ల నుంచి సేకరించిన బియ్యాన్ని స్వామి సేవకు తలంబ్రాలుగా వినియోగించనున్నారు. వసంత పంచమి సందర్భంగా కడప నగరంలోని పలువురు భక్తులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ధర్మ ప్రచార పరిషత్, విశ్వహిందూ పరిషత్ ప్రముఖులు కడపకు చెందిన బెస్త వేముల రామమహేశ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. జిల్లాలోని పలువురు మహిళా భక్తులు, పెద్దలు కోటి తలంబ్రాల తయారీ కార్యక్రమంలో తమకు కూడా భాగస్వాములయ్యే భాగ్యం కల్పించాలని కోరుతున్నారు. స్పందించిన రామమహేష్ ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాల కల్యాణోత్సవం (ఏప్రిల్ 5) రోజున గోటి తలంబ్రాలను వాడేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పాల్గొనదలిచిన వారికి తాము వడ్లు సరఫరా చేస్తామని, దీనికి ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు. భగవంతుని సేవ చేసుకోవడం మాత్రమే ఈ కార్యక్రమ లక్ష్యమని తెలిపారు. ఒక ప్యాకెట్‌లో 100–120 గ్రాముల వడ్లు మాత్రమే ఉంటాయని, భక్తులు ఎన్ని వడ్లయినా వలచవచ్చని తెలిపారు. వడ్లు కావాల్సిన వారు 97045 20511 లేదా 99632 50948 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వైభవంగా మహా కుంభాభిషేకం

చండీ హోమం నిర్వహించిన హంపి పీఠాధిపతి శ్రీవిరూపాక్ష విద్యారణ్యస్వామి



మహాకుంభాభిషేకం నిర్వహిస్తున్న హంపి పీఠాధిపతి శ్రీవిరూపాక్ష విద్యారణ్యస్వామి

మైదుకూరు : మైదుకూరులోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆరు రోజులుగా నిర్వహించిన మహా కుంభాభిషేక మహోత్సవాలు వైభవంగా ముగిశాయి. చివరి రోజు శుక్రవారం ఆలయంలో హంపి పీఠాధిపతి శ్రీవిరూపాక్ష విద్యారణ్యస్వామి కుంభాభిషేకం, చండీ హోమం నిర్వహించారు. ఆదివారం నుంచి ప్రారంభమైన మహా కుంభాభిషేక ఉత్సవాల్లో గోపూజ, గణపతి పూజ, మాతృకపూజలతోపాటు ప్రతి రోజూ చండీ హోమం, చతుర్వేద పారాయణం నిర్వహించారు. శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించి కలశాల్లో ఐదు నదుల పవిత్ర జలాలను ఉంచి హోమాలు నిర్వహించారు. హంపి పీఠాధిపతి శ్రీవిరూపాక్ష విద్యారణ్యస్వామి ఆలయ గర్భగుడిపైన మహా కుంభాభిషేకం నిర్వహించారు. అనంతరం చండీ హోమం చేసి, కలశాల్లోని పంచనదీ జలాలను భక్తులపై చల్లి స్వాంతన చేకూర్చారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యసభ అధ్యక్షుడు సూరిశెట్టి శివవెంకట ప్రసాద్, శ్రీశైలం బోర్డు సభ్యురాలు సూరిశెట్టి మాధవిలత, ఆర్యవైశ్యసభ కార్యవర్గం యలవలి హరికిషన్, దరిశా సునీల్, దొంతు వెంకటసుబ్బయ్య, ఎలిశెట్టి ప్రసాద్, మిట్టా సురేష్, ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు మాలేపాటి పద్మజ, ఉపాధ్యక్షులు రమాదేవి, శ్రీవాణి, ప్రధాన కార్యదర్శి బి.లత తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా అమ్మవారి గ్రామోత్సవం

మహా కుంభాభిషేక మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి మైదుకూరులో శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి గ్రామోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున బాణసంచా పేలుళ్లు, కోలాటం, కూచిపూడి నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి. చెక్క భజన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆర్యవైశ్యసభ నాయకులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి



రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న జేసీ

పులివెందుల రూరల్ : పులివెందుల మోడల్ టౌన్‌లో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ సాయికాంత్‌వర్మ పేర్కొన్నారు. పులివెందుల పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి ఆయన శుక్రవారం పరిశీలించారు. నగర వనం, గరండాల్ బ్రిడ్జి, స్పోర్ట్స్ కాంప్లెక్స్, వాటర్ ట్యాంక్‌ల నిర్మాణ పనులను పరిశీలన చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేష్, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, తహసీల్దార్ మాధవ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.